క్లుప్తంగా

ఈదమ్మ దేవత కల్యాణానికి ముస్తాబు


ఈదమ్మ ఆలయం

కడ్తాల్: ఈదమ్మ దేవాలయంలో 16 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్న ఈదమ్మ దేవత ఆలయ మహోత్సవానికి ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాలలో భాగంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా వివిధ రంగులతో, విద్యుత్ దీపాలతో శోభయమానంగా అలంకరించారు. 16వ తేదీ మంగళవారం ఈదమ్మ దేవతకు అభిషేకం, పుట్ట తప్పడం, గంగ తెప్ప, ఐదు బోనాలు, 17న ఈదమ్మ బోనాలు, సాయంత్రం జెల్లీ, రాత్రి ఈదమ్మ కథను వివరిస్తారు. 18వ తేదీ గురువారం ఉదయం ఈదమ్మ దేవత కల్యాణం, సూర్యభోనం, రాత్రికి బలి నిర్వహించబడుతాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

నేడు కాంగ్రెస్ సమావేశం


మాట్లాడుతున్న మంగమ్మ తదితరులు

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి మన్నెగూడలోని బీఎంఆర్ సార్థ కన్వెన్షన్ హాల్‌లో సోమవారం నిర్వహించనున్న ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కాంగ్రెస్ కార్యకర్తల సమావేశానికి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షురాలు, కౌన్సిలర్ కొత్తకుర్మ మంగమ్మ పిలుపు నిచ్చారు. ఆదివారం తుర్కయంజాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ భువనగిరి పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయం అని, కార్యకర్తలందూ సమన్వయంతో పనిచేస్తే భారీ మెజార్టీ సాధిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఇతర రాష్ట్ర నాయకులు పాల్గొంటారని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కోశిక ఐలయ్య, కౌన్సిలర్ కాకుమాను సునీల్, కొత్తకుర్మ శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తనిఖీలు ముమ్మరం


యాచారంలో కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

యాచారం: లోక్‌సభ ఎన్నికల కోడ్ నేపథ్యంలో పోలీసులు వాహనాల తనిఖీలను ముమ్మరం చేశారు. నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై యాచారం పోలీసులు నిత్యం వాహనాలను తనిఖీలు చేస్తున్నారు. యాచారం మండల కేంద్రం, మాల్ మార్కెట్, చింతపట్ల, గునుగల్, తక్కళ్లపల్లి తదితర గేట్ల వద్ద వాహనాలను నిలిపి పోలీసులు తనిఖీలు చేపడుతున్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న దృష్ట్యా ప్రయాణికులు నింబంధనలు పాటించాలని యాచారం సీఐ శంకర్‌కుమార్ తెలియజేశారు.

ప్రతిఒక్కరూ సేవాభావం అలవర్చుకోవాలి

జిల్లా ఎంపీటీసీల సంఘం గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి


వంట పాత్రలు పంపిణీ చేసిన శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్: సమాజంలో ప్రతిఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలని, జిల్లా ఎంపీటీసీల సంఘం గౌరవ అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని 12వ వార్డు, 13వ వార్డుల్లో ఎలాంటి శుభాకార్యాలు జరిగినా, పండుగలు చేసుకున్నా, వారికి వంట చేసుకోవడానికి రూ.15వేల వంట పాత్రలు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ, పండుగలు, శుభాకార్యాల సందర్భంగా పేద ప్రజలు ఇబ్బందులు పడొద్దనే ఉద్దేశ్యంతోనే వంట పాత్రలు కొనిచ్చామన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ లక్ష్మయ్య, యాదయ్యగౌడ్, మంకి శ్రీను, వెంకటరమణ, మహేశ్, శ్రీశైలం, శ్రీకాంత్, కృష్ణ, నాగార్జున, నర్సింహ, శ్రీను, పాపమ్మ, పద్మ, ఈరమ్మ తదితరులు పాల్గొన్నారు.


యాచారంలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు


కడ్తాల్: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి


ఆమనగల్లు : నివాళులర్పిస్తున్న అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు మహేశ్

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి


ఇబ్రహీంపట్నం రూరల్: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రంగారెడ్డి, ఆదిబట్ల మున్సిపల్ చైర్మన్ నిరంజన్‌రెడ్డి

భారత రాజ్యాంగ నిర్మాత, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అందరివాడని, ఆయన రాసిన రాజ్యాంగంతోనే పేదలకు ఓటు హక్కు, రిజర్వేషన్ల ఫలాలు దక్కాయని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. యాచారం, గునుగల్ కేంద్రాల్లో అంబేడ్కర్ జయంతి వేడుకల్లో పాల్గొని పూలమాలలేసి నివాళుర్పించారు. కడ్తాల్‌లో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి నివాళులర్పించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, ప్రపంచ మేధావి అని పలువురు కొనియాదారు. మహిళలు, కార్మికులు, పేదలు, అణగారిన వర్గాల అభ్యున్నతికి ఎనలేని కృషి చేశాడని, స్త్రీల విద్యకు, అభివృద్ధికి దారిచూపిన మహనీయుడని పలువురు పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ఆయామండలాలతో పాటు గ్రామాల్లో, ఆయా యువజనసంఘాలు, ప్రజాప్రతినిధులు, రాజకీయనాయకులు, ఆదివారం నిర్వహించిన జయంతిలో పాల్గొన్నారు. అంబేడ్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.


తుర్కయంజాల్: జయంతి వేడుకల్లో డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ తదితరులు


యాచారం: మాల్‌లో జెడ్పీటీసీ సభ్యురాలు చిన్నోళ్ల జంగమ్మ తదితరులు


మంచాల: జయంతి ఉత్సవాల్లో పాల్గొన ఇబ్రహీం పట్నం ఏసీపీ కేపీవీ రాజు


మాడ్గుల: కోలుకులపల్లిలో నివాళులర్పిస్తున్న యువజన సంఘం నాయకులు


తలకొండపల్లి: మెదక్‌పల్లిలో విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ


కడ్తాల్: జయంతి వేడుకలో జెడ్పీటీసీ దశరథ్‌నాయక్


అబ్దుల్లాపూర్‌మెట్: గౌరెల్లిలో అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో..

ధనరాశిగుట్ట బ్రహ్మోత్సవాలకు సిద్ధం


ధనరాశి గుట్ట రాధాకృష్ణస్వామి ఆలయం

- ఈ నెల 17 నుంచి ప్రారంభం
- కొలువైన రాధాకృష్ణ స్వామి
- ప్రకృతి రమణీయత, సహజత్వం ఉట్టిపడే ఆలయం
- నాలుగు రోజుల పాటు కొనసాగనున్న వేడుకలు


ఆలయంలో సీతారామచంద్ర స్వామి

కడ్తాల్: కడ్తాల్ మండలం, బాలాజీ నగర్ తండా గ్రామ పంచాయతీ సమీపంలో ధనరాశి గుట్టపై వెలసిన శ్రీ రాధాకృష్ణస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 17నుంచి ప్రారంభమై 20వ తేదీ శనివారం వరకు నాలుగు రోజుల పాటు కొనసాగనున్నాయి. ఈ ప్రాంతంలో గుర్తింపు పొందిన రాధాకృష్ణ స్వామి ఆలయంగా ప్రసిద్ధి చెందింది. ఈ ఆలయాన్ని వార్షిక బ్రహ్మోత్సవాలకు సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. చుట్టూ కొండల నడుమ ఎత్తైన ధనరాశి గుట్టపై, ప్రకృతి రమణీయ ప్రదేశంలో చూడచక్కగా ఆలయ నిర్మాణం ఉంటుంది. ఎత్తైన కొండపై తెల్లటి చలువరాతితో నిర్మించిన ఆలయాన్ని దర్శించుకున్న భక్తులు మంత్రముగ్దులవుతారు. ఒక మహా భక్తుడి స్వప్న సాకార ముక్తి క్షేత్రంగా, కలిదోష సర్వపాప, సర్వరోగ నివారణకై వెలసిన బ్రహ్మాండమైన దివ్యక్షేత్రంగా శ్రీరాధాకృష్ణస్వామి ఆలయం వెలుగొందుతుంది. ఈ ఆలయంలో స్వయంభూ వేంకటేశ్వర స్వామి, రాధాకృష్ణస్వామి, సీతారామచంద్ర, లక్ష్మణహనుమాన్ స్వాములు కొలువుదీరి ఉన్నారు. ప్రతి ఏటా జరిగే ఉత్సవాలలో భాగంగా ఆలయాన్ని సుందరంగా విద్యుత్ దీపాలు, వివిధ రంగులతో అలంకరించి శోభాయమానంగా తీర్చిదిద్దారు.

ఉత్సవాలు ఇలా..

ఈ బ్రహ్మోత్సవాలు 17వ తేదీ బుధవారం ప్రారంభమై 20వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఉత్సవాల వివరాలను ఆలయ ధర్మకర్త రమావత్ బీచ్యానాయక్ వివరించారు. 17వ తేదీ బుధవారం సీతారామచంద్రస్వామి వారి కల్యాణం, 18న విశ్వక్సేన ఆరాధన, పుణ్యహవాచనం, అంకురార్పణ, అంకురారోహణ, దేవత ఆహ్వానం, అగ్నిప్రతిష్ఠ, ధ్వజారోహనం, బలిహరణం, హవనం, ఎదురుకోళ్లు, 19న రుక్మిణీ కల్యాణం, పల్లకీ సేవ, భజనలు 20న మహా పూర్ణహూతి, పుష్పయాగం, ద్వాదశరాధన, దేవత ఉద్వాసన, మహాదాశీ్వరాదంతో ఉత్సవాలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు.

ఆలయానికి ఇలా చేరుకోవచ్చు

ప్రతి ఏటా జరిగే వార్షిక బ్రహ్మోత్సవాలకు హైదరాబాద్‌తో పాటు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున్న భక్తులు తరలి వస్తుంటారు. హైదరాబాద్ నుంచి వచ్చే భక్తులు శ్రీశైలం హైదరాబాద్ జాతీయ రహదారిపై 50కిలో మీటర్ల దూరంలో వాసుదేవ్‌పూర్ గేట్ నుంచి, ప్రధాన రహదారి నుంచి 3కిలో మీటర్ల దూరంలో బాలాజీనగర్ మీదుగా చేరుకోవచ్చు. ప్రతి ఐదు నిమిషాలకు హైదరాబాద్ నుంచి బస్సు సౌకర్యం కలదు.

ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం

మూడు రోజుల పాటు ధనరాశికొండపై నిర్వహించనున్న రాధాకృష్ణస్వామి ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తున్నాం. అన్నదానంతో పాటు, ప్రత్యేక వసతి సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నాం.

– రమావత్ బీచ్యానాయక్, దేవాలయ ధర్మకర్త

శెట్టిపల్లిలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం శెట్టిపల్లి గ్రామంలో ఆదివారం అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో శెట్టిపల్లి మాజీ సర్పంచ్ ఎగిరిశెట్టి సత్యం, లాలయ్యగౌడ్, చంద్రమౌళి, పెద్దయ్య, నర్సింహా, లక్ష్మయ్య, ఎట్టయ్య తదితరులు పాల్గొన్నారు.


ఆమనగల్లు: అంబేడ్కర్ విగ్రహావిష్కరణలో సత్యం

చేవెళ్లలో కాంగ్రెస్ విజయం తథ్యం

మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్

కందుకూరు: చేవెళ్ల లోక్‌సభ స్థానాన్ని కాంగ్రెస్ గెల్చుకుంటుందని మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని టంకరి రాంరెడ్డి ఫంక్షన్‌హాల్‌లో కాంగ్రెస్ చేవెళ్ల పార్లమెంట్ ఇన్‌చార్జి నిజాముద్దీన్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలాన్ని నాలుగు క్లస్టర్లుగా విభజించి ఆయా చోట్ల నాయకులకు బాధ్యతలు అప్పగిస్తామన్నారు. ప్రతి ఇరవై ఐదు ఇళ్లకు ఒకరిని నియమిస్తున్నామన్నారు. బాధ్యతలు తీసుకోవాడానికి పేర్లు ఇవ్వాలన్నారు. అందరం కష్టపడి పని చేస్తే చేవెళ్లలో కాంగ్రెస్ జెండా ఎగరవేయడం ఖాయమన్నారు. తాను నిస్వార్థంగా పని చేస్తున్నానని, ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలన్నారు. మనందరి లక్ష్యం పార్టీ గెలుపేనన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్ తీగల అనితా రెడ్డి మాట్లాడుతూ మరో 25 రోజులు కష్టపడితే విజయం మనదేనన్నారు. గ్రామాల్లో ఇంటింటికి తిరిగి ప్రచారం చేసే బాధ్యత కార్యకర్తల భుజస్కంధాలపైనే ఉందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ఇన్‌చార్జి ఎల్మటి అమరేందర్‌రెడ్డి, జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, పీసీసీ నాయకులు ఏనుగు జంగారెడ్డి, దేప భాస్కర్‌రెడ్డి, సరికొండ మల్లేశ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి, సీనియర్ నాయకులు ఎస్ కృష్ణనాయక్, రాణాప్రతాప్‌రెడ్డి, ఎండీ అఫ్జల్‌బేగ్, ప్రశాంతిపాండురంగారెడ్డి, అందుగుల సత్యనారాయణ, మూల హన్మంత్‌రెడ్డి, నర్సింహాచారి, ఢిల్లీ శ్రీధర్, ఆయూబ్, యాదయ్య, ఎస్ జగన్ తదితరులు పాల్గొన్నారు.